# కూరగాయల నిల్వ.. శుద్ధిని ప్రోత్సహిస్తే విలువ

ఏ దేశం ఎదగాలన్నా వ్యవసాయమే కీలకమనేది విదితమే. ఆర్థిక వ్యవస్థలో దాని పాత్ర అలాంటిది మరి. దేశంలో అధిక శాతం జీవనోపాధి కల్పిస్తున్నది వ్యవసాయ రంగమే. దీనికి పెద్ద పీట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉత్పాదకత వృద్ధితో పాటు ఈ రంగం ఎదుర్కొనే సవాళ్లెన్నో. వ్యవసాయ రంగ ప్రాధాన్యం, ప్రణాళికలు తదితర వివరాలను తెలుసుకుందాం.




### వ్యవసాయంలో ఉత్పాదకత సంక్షోభాలను దాటిపోగల సమర్థత

2047 వరకు దేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలని కేంద్ర ప్రభుత్వం దృఢంగా సంకల్పించడమేగాక ఆ దిశగా పరివర్తన చర్యలు కూడా చేపట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నందువల్ల ఈ పరివర్తన సాధనలో వ్యవసాయ రంగం కీలకమైంది.

- దేశ జనాభాలో 42.3 శాతం మందికి ఇప్పుడు వ్యవసాయం జీవనోపాధి కల్పిస్తున్నది. ప్రస్తుత ధరల ప్రకారం దేశ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)లో దీని వాటా 18.2 శాతం వికాస్ భారత్ కోసం రూపొందిస్తున్న వ్యూహాత్మక ప్రణాళికల్లో వ్యవసాయాన్ని ఒక ప్రాధాన్యతా రంగంగా నిలపడం ద్వారా ప్రభుత్వ సంకల్పాలు కేంద్ర బడ్జెట్ (2024-25)లో ప్రతిబింబిస్తున్నాయి.
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తమ బడ్జెట్ ప్రసంగంలో 9 ప్రాధాన్యతా రంగాలను గుర్తించినట్లు ప్రకటించారు. వాటిలో మొదటిది 'వ్యవసాయ ఉత్పాదకత-సంక్షోభాలను సులభంగా దాటిపోగల సమర్థత'.
- వ్యవసాయానికి దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ దిశగా ఇప్పటికే పథకాలు, చర్యలు తీసుకున్న కారణంగా గత ఐదేళ్లలో ఈ రంగంలో సగటు వార్షిక వృద్ధి 4.18 శాతంగా నమోదైంది.
- వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను తోడ్పాటును అందిస్తున్నందువల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి 2022-23లో అంతకుముందెన్నడూ లేనంతగా 32 కోట్ల 97 లక్షల టన్నులుగా నమోదైంది. 2023-24లో ఇది స్వల్పంగా 32 కోట్ల 88 లక్షల టన్నులకు తగ్గింది. దీనికి కారణం అనావృష్టి, వానలు సకాలంలో పడకపోవడంగా గుర్తించారు.
- పశు సంవర్ధక విభాగం, పాడి, మత్స్య పరిశ్రమల వంటి అనుబంధ రంగాల్లో వృద్ధి తగినంతగా నమోదైంది. మొత్తం మీద వ్యవసాయ రంగం వృద్ధి సంతృప్తికరంగానే ఉంది.
- అయితే ఈ రంగం ఎదుర్కొనే సవాళ్లు ఎన్నో. వాటిలో ఎక్కువగా వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత, ఉత్పత్తి తిరోగమనం, మౌలిక సదుపాయాల కొరత ఉండటం వంటివి ఉన్నాయి. అందువల్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి అవకాశాలు కల్పించడం జరిగింది.

### ప్రకృతి పోషకాలు

- పరిశోధనలతో పాటూ ప్రకృతి సహజత్వానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తుంది. వచ్చే రెండేళ్లలో దాదాపు కోటి మంది రైతులతో సేంద్రీయ వ్యవసాయం చేయాలని ప్రతిపాదించింది. మంచి లాభాలు ఆర్జించాలంటే మార్కెట్ సదుపాయాలు బాగుండాలి.
- ముడి పదార్థాలను రైతులకు నేరుగా అందించడానికి 10 వేల వనరుల కేంద్రాలను ఆవశ్యకత ప్రాతిపదకపై ప్రారంభిస్తారు. దీనికి శాస్త్రీయ పరిశోధనా సంస్థలను, గ్రామ పంచాయతీలను రంగంలోకి దింపుతారు. వ్యవసాయం... రసాయనాల వంటి బయటి పదార్థాలను వినియోగించకుండా పంటలు, పశువులు ఇతరత్రా సంప్రదాయ పద్ధతులను ఉపయోగించి సాగు చేస్తారు.
- అంటే వనరులను పునర్వినియోగించుకోవడం ద్వారా చేనూచెలకల్లోనే గరిష్ఠంగా పనులను చేసుకుంటారు. దీనివల్ల సాగుకయ్యే ఖర్చు తక్కువ. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణాభివృద్ధి కూడా సర్వతోముఖాభివృద్ధి ఉంటుంది.
- 2023-24 నుంచి జాతీయ సేంద్రీయ సాగు పథకం ఇప్పటికే అమల్లో ఉంది. అంతకుముందున్న 'భారతీయ ప్రకృతి కృషి పద్ధతి' పథకాన్ని ఇలా పేరు మార్చారు. సహజ సేద్య నమూనాలను దేశంలోని విభిన్న వాతావరణ మండలాలకు తగ్గట్లుగా అవలంబించాల్సిన పద్ధతులను ఐసీఏఆర్ ఇప్పటికే అభివృద్ధి చేసింది.
- పోషకాల రక్షణ, రైతుల ఆదాయ పెంపు, ఉపాధి కల్పన వంటి అంశాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, భారీ వినియోగ ప్రదేశాలకు సమీపాన కూరగాయలను ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి వీలుగా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది.
- ఆరోగ్య సంరక్షణ, పోషకాల విలువల పట్ల ప్రజలు చైతన్యవంతులు కావడంతో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కూరగాయలకు గిరాకీ బాగా పెరుగుతుంది. దీనికి ప్రభుత్వం నుంచి చేయూత అందడంతో కూరగాయల ఉత్పత్తిలో దేశం ఇప్పుడు ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది.
- 2022-23లో దేశంలో 21 కోట్ల 25 లక్షల టన్నుల కూరగాయలు సాగయ్యాయి. అయితే వీటిలో చాలా రకాలు ఎక్కువ కాలం నిల్వ ఉండేవి కాకపోవడంతో వీటిని మార్కెట్లకు త్వరగా తరలించాల్సి ఉంటుంది. లేదంటే వీటి నిల్వకు, శుద్ధి ప్రక్రియకు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందువల్ల వీటిని సేకరించడం, నిల్వ, మార్కెటింగ్ చేయడానికి అవసరమైన సరఫరా వ్యవస్థలను, స్టార్టప్‌లు, సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసుకోవడానికి తగిన ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- శుద్ధి ప్రక్రియలను ప్రోత్సహిస్తే కూరగాయలు త్వరగా పాడవకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి వీలవుతుంది. టమాటోలు, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డల కోసం ఇలాగే 2018-19లో 'హరిత కార్యాచరణ' (ఆపరేషన్ గ్రీన్)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తర్వాత దీన్ని 22 పంటలకు (11 కూరగాయలు, 10 పండ్ల రకాలు, 1 రొయ్యలకు) విస్తరించింది. ఈ హరిత కార్యాచరణ వల్ల కొరత సమయంలో ధరలు పెరగకుండా నిలకడగా ఉండేటట్లు చూడటంతోపాటు సేకరణ, నిల్వ వ్యవస్థల ద్వారా రైతులకు భరోసా కలిగించవచ్చు.
- ఆహార ధాన్యాలు, పాలు ఇతరత్రా ప్రధాన ధాన్యాల ఉత్పత్తిలో మంచి సమృద్ధి సాధించినా పప్పు ధాన్యాలు, చమురు విత్తుల ఉత్పాదకత చాలా సవాళ్లు ఎదుర్కొంటుంది. మరో పక్క గిరాకీ క్రమేణా పెరిగిపోతుంది. దీన్ని తట్టుకోవడానికి ప్రభుత్వం దిగుమతుల మీదనే ఆధారపడాల్సి వస్తుంది. అంటే ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు గండి పడినట్టే.
- ఆవాలు, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి చమురు విత్తుల ఉత్పాదనలో ఆత్మనిర్భరత సాధించడానికి వ్యూహరచన చేస్తుంది.
- పప్పు ధాన్యాలకు సంబంధించి జాతీయ ఆహార భద్రత పథకాన్ని 28 రాష్ట్రాల్లో, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేస్తుంది. పప్పు ధాన్యాల్లో అధిక ఉత్పత్తినిచ్చే వంగడాల నాణ్యమైన విత్తనాలను రైతులకు ఉచితంగా అందిస్తుంది. మద్దతు ధర పెంచుకుంటూపోతుంది. ఈ చర్యల ఫలితంగా గత పదేళ్లలో 2014-15 నుంచి 2023-24 వరకు చమురు, విత్తనాలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి 43 నుంచి 44 శాతానికి పెరిగింది.

### డిజిటల్ వ్యవసాయం, డిజిటల్ సాధికారత

- రైతుల సామర్థ్యాన్ని పెంచడానికి, ఉత్పాదకతను పెంచడానికి ఈ రంగంలో స్థిరత్వాన్ని సాధించడానికి 'డిజిటల్ వ్యవసాయం' ఆలోచన త్వరగా కార్యరూపంలోకి మారబోతున్నది. రాష్ట్రాల సహకారంతో వ్యవసాయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఆర్థికమంత్రి తమ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.
- ఈ సంవత్సరం ఈ డీపీఐని ఉపయోగించి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 400 జిల్లాల్లో డిజిటల్ పద్ధతిలో పంటల సర్వేను చేపడతారు. మూడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా రైతులు, వారి భూములు కూడా డిజిటల్ పరిధిలోకి వచ్చేస్తాయి.
- అంటే ఆరు కోట్ల రైతుల వివరాలు, వారి భూముల వివరాలు, పంటల సర్వేను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయాల్సిందిగా గత సంవత్సరమే కేంద్రం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రభుత్వాలను కోరింది. 12 రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం విజయవంతమైంది.
- వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వం అభివృద్ధి చేసే డీపీఐని ప్రజా శ్రేయస్సు కోసం అందరికీ అందుబాటులో ఉంచనుంది. ఇది ప్రధానంగా మూడు భాగాలుగా ఉంటుంది.
- మొదటిది అగ్రిస్టాక్. దీనిలో రైతులు, భూములు, పంట వివరాలు మూడు డేటాబేసుల్లో ఉంటాయి.
- రెండోది కృషి డీఎస్ఎస్. దీనిలో ఆ ప్రాంతంలోని నేల స్వభావం, వాతావరణ మార్పుల వంటివి నమోదవుతాయి.
- మూడోది కేఎం. ఇది జియో స్పేషియల్ మొబైల్ యాప్. భూ సంబంధమైన అన్ని పథకాలకు పనికొస్తుంది. నేల స్వభావాన్ని అంచనా వేసి చెబుతుంది. పంట దిగుబడిని కచ్చితంగా అంచనా వేసి సర్వే నివేదికలు అందిస్తుంది. ఈ 'డిజిటల్ వ్యవసాయ' పద్ధతులకు దాదాపు వెయ్యి స్టార్టప్‌లు సహాయకారిగా ఉంటాయి. వీటిలో స్త్రీలు నడిపే స్టార్టప్‌లు కూడా ఉంటాయి. వ్యవసాయ రంగం కూడా చాలా వేగంగా డిజిటల్ యుగంలోకి అడుగు పెడుతున్నది.

## పరిశోధన - భావి వ్యూహం

- వ్యవసాయ రంగంలో పరిశోధనలు మూడు రకాలుగా ఉన్నాయి. జోక్యం, నూతన అన్వేషణలు, నూతన ప్రక్రియల్లో వాటి ప్రాముఖ్యతలను అవి ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటూనే ఉన్నాయి. నిజానికి దేశంలో ఉన్న వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సంబంధిత విద్యాపరమైన వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్దదని చెప్పుకోవడం గర్వకారణంగా భావించాలి.
- ఉత్పాదకతను పెంచడానికి అన్ని రకాల సంక్షోభాలను తట్టుకోగల వంగడాల అభివృద్ధికి సమగ్ర సమీక్ష జరపాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇందులో మరింత ముందుకెళ్లాలంటే పరిశోధనల్లో ప్రైవేటు రంగాన్ని కలుపుకొని పోవాలి.
- అధిక ఉత్పాదక సామర్థ్యం గల 109 రకాల వంగడాలను, వాతావరణ విపత్తులను తట్టుకోగల 32 రకాల ఉద్యాన పంటలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటువంటి రకాల పంటలు, సర్వసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలను, కరువు కాటకాలను ముంపువంటి విపత్తులను తట్టుకోగలవు.
- వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని పరిశోధన, విద్యా విభాగం మౌలిక వసతులు, కొత్త సాంకేతికతల అభివృద్ధిని పర్యవేక్షిస్తుంటుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.9,941.09 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.9,876.60 కోట్లుగా ఉంది. విద్యతో సహా వ్యవసాయ పరిశోధన మీద ఖర్చు చేసే ప్రతి రూపాయికి రూ.13.85 ప్రతిఫలం మనకు దక్కుతుంది.
- 2022-23లో వ్యవసాయ పరిశోధనకు రూ.19.65 వేల కోట్లు ఖర్చు చేశారు. దాని ఫలితాలు అంతే ఆకర్షణీయంగా అందాయి. ఈ కాలంలో అత్యున్నత పరిశోధన సంస్థ అయిన ఐసీఏఆర్ (భారత వ్యవసాయ పరిశోధన మండలి) 347 రకాల కొత్త అధిక ఉత్పత్తి వంగడాలను విడుదల చేసింది. వాణిజ్య సాగు నిమిత్తం 99 రకాల ఉద్యాన పంటల రకాలను కూడా ఆవిష్కరించింది.
- వ్యవసాయ పరిశోధన పటిష్ఠంగా ఉంటే దేశానికి, రైతులకు లాభాలు అందుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం దీనిపై ఎక్కువ దృష్టి సారిస్తుంది.

యోజన సౌజన్యంతో..

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఈఎస్ఈ-2025

ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది.

- యూపీఎస్సీ- ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025
- **మొత్తం ఖాళీలు:** 232
- **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఈసీఈ
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 8
- **వెబ్‌సైట్:** https://upsc.gov.in

### ఎన్ఆర్‌డీసీలో...

నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డీసీ)లో రెగ్యులర్/కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 9
- **పోస్టులు:** మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్
- **దరఖాస్తు:** ఈ-మెయిల్ ద్వారా
- **చివరితేదీ:** అక్టోబర్ 9
- **వెబ్‌సైట్:** www.nrdcindia.com

### నిట్‌లో...

ఏపీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కింది ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 125
- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, గ్రేడ్-1, 2 అసిస్టెంట్ ప్రొఫెసర్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 10
- **వెబ్‌సైట్:** https://www.nitandhra.ac.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ : ఉద్యమ చరిత్ర, పాలిటీ బిట్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

---

మధ్యయుగ తెలంగాణ చరిత్ర

# హారతి అనే కులదేవతను ఏ వంశస్థులు పూజించేవారు?



పోటీ పరీక్షల ప్రత్యేకం
చరిత్ర బిట్స్

**1. ఇక్ష్వాకు రాజవంశానికి చెందిన స్త్రీలు బౌద్ధ మతానికి ఎనలేని సేవ చేశారు. ఈ నేపథ్యంలో కింది వాటిలో సరికానిది గుర్తించండి.**
ఎ. వాసిష్ఠ భట్టిదేవి, కోడబలసిరి మహిశాసక బౌద్ధుల కోసం స్థూపాలు విహారాన్ని నిర్మించారు
బి. సింహళ బౌద్ధ భిక్షువుల కోసం ఉపాసిక ఒక విహారాన్ని నిర్మించింది
సి. మహాదేవి బాహుశృతీమ బౌద్ధుల కోసం స్థూపాన్ని, విహారాన్ని నాగార్జున కొండలో నిర్మించింది
డి. నాగార్జున కొండలోని మహాచైత్య విహారాన్ని రాణి కోడబలసిరి పునర్నిర్మించింది
1) ఎ, సి 2) సి
3) బి 4) డి

**2. కింది వాటిలో వాసిష్ఠ పుత్ర శ్రీశాంతమూలుడి గురించి సరైనవి గుర్తించండి.**
ఎ. ఇతను అశ్వమేధ, వాజపేయి, అగ్నిహోత్ర, అగ్నిష్టోమ యాగాలు చేశాడు
బి. గోశతసహస్ర, హలశతసహస్ర అనే బిరుదులు ఉన్నాయి
సి. ఇక్ష్వాకు రాజ్యాన్ని స్థాపించింది వసిష్ఠ పుత్ర శ్రీశాంతమూలుడు
డి. ఇతని దాన శాసనాలు పల్నాడులోని రెండల, కేశనపల్లిలో లభ్యమయ్యాయి.
1) ఎ, బి, సి 2) ఎ, బి
3) బి, సి, డి 4) పైవన్నీ సరైనవే

**3. ఇక్ష్వాకు రాజులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. రుద్రపురుషదత్తుడు | 1. నాగార్జున కొండలో ఛాయాస్తంభ శాసనం |
| బి. వసిష్ఠ పుత్ర శ్రీ ఎహుబల శాంతమూలుడు | 2. మేనత్త కుమార్తెలను వివాహం చేసుకోవడం |
| సి. మాఠరీపుత్ర శ్రీవీర పురుషదత్తుడు | 3. బ్రాహ్మణులకు లక్షగోవులు, నాగళ్లు దానం |
| డి. వాసిష్ఠ పుత్ర శ్రీశాంతమూలుడు | 4. హిందూ దేవాలయాల నిర్మాణం ప్రారంభం |

1) ఎ-1, బి-4, సి-2, డి-3 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-3, బి-4, సి-2, డి-1

**4. ప్రాచీన కాలంలో నేర నిర్ధారణకు 9 రకాల దివ్య పరీక్షలు ఉండేవి. కింది వాటిని జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. తప్త మస్క దివ్య | 1. దేవత విగ్రహాలను కడిగిన నీరు తాగడం |
| బి. కోశదివ్య | 2. కాలుతున్న వస్తువును చేతితో పట్టుకోవడం |
| సి. ఫలదివ్య | 3. మంత్రించిన బియ్యాన్ని నమలడం |
| డి. తుండుల దివ్య | 4. మరుగుతున్న నూనె నుంచి నాణాన్ని తీయడం |

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-3, బి-2, సి-1, డి-4 4) ఎ-1, బి-2, సి-3, డి-4

**5. కింది వాటిలో సరైనవి గుర్తించండి.**
ఎ. నాణెముల ఆధారంగా ఇక్ష్వాకు వంశంలో నలుగురు రాజులు ఉన్నారని చరిత్రకారుల అభిప్రాయం
బి. మత్స్య పురాణం ఇక్ష్వాకు వంశంలో ఏడుగురు రాజులు ఉన్నారని తెలుపుతుంది
సి. ప్రాచీన కాలంలో నల్లమల ప్రాంతాన్ని శ్రీపర్వతం అని పిలిచారు
డి. పురాణాలు ఇక్ష్వాకులను శ్రీపర్వతీయులు అన్ని పేర్కొంటున్నాయి
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) బి, సి, డి 4) పైవన్నీ సరైనవే

**6. కింది వాటిలో నాగార్జున కొండలో లేని ఆలయాన్ని గుర్తించండి.**
1) వితలస్వామి ఆలయం, చెన్నకేశవాలయం, దుర్గామాత ఆలయం
2) పుష్పభద్రస్వామి ఆలయం, నోడగిరేశ్వర ఆలయం, అష్టభుజ స్వామి ఆలయం
3) జీవస్వామి ఆలయం, కార్తికేయ ఆలయం, హరితమాత ఆలయం
4) సర్వదేవాలయం, భూతగ్రహ ఆలయం, హలంపూర స్వామి ఆలయం

**7. ఇక్ష్వాకులు మొదట శాతవాహనులకు సామంతులుగా పనిచేశారనే సమాచారాన్ని కింది ఏ శాసనాలు తెలుపుతున్నాయి?**
ఎ. సింహవర్మ మంచికల్లు శాసనం
బి. రుద్రపురుషదత్తుడి ఫణిగిరి శాసనం
సి. రామిరెడ్డి పల్లి శాసనం
డి. వీరపురుషదత్తుడి అల్లూరి శాసనం
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) బి, సి, డి 4) పైవన్నీ సరైనవే

**8. కింది వాటిలో సరైనవి గుర్తించండి.**
ఎ. హిందూ దేవాలయాల నిర్మాణం ఇక్ష్వాకుల కాలంలోనే ప్రారంభమైంది
బి. నాగార్జున కొండలో లభించిన బుద్ధుడి శిల్పం, బోధిసత్వ అవలోకటేశ్వర శిల్పం అత్యంత ప్రముఖం
సి. చనిపోయిన వీరులను పూజించే వీరాగల్ సంప్రదాయం ఇక్ష్వాకుల కాలంలోనే ప్రారంభమైంది
డి. అమరావతిలో రోమన్ శైలిలో నిర్మించిన స్టేడియం బయటపడింది
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) పైవన్నీ సరైనవే

**9. ఇక్ష్వాకుల సామంతులకు సంబంధించి కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.**
1. పుగియ వంశస్థులు - నల్లగొండ ప్రాంతం
2. దండ నాయకులు - ధాన్యకటకం ప్రాంతం
3. చూటు వంశస్థులు - బనవాసి ప్రాంతం
4. హిరణ్యక, చెలికి వంశస్థులు - రాయలసీమ ప్రాంతం

**10. ఇక్ష్వాకులకు సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.**
ఎ. ఆయకపతములపై చెక్కిన శిల్పాలకు జాతక కథలు నేపథ్యంగా మారాయి
బి. మేనత్తల కుమార్తెలను వివాహం చేసుకునే సంప్రదాయం కొనసాగింది
సి. నాగార్జునకొండలో సంతానం కోసం సప్తమాత్రిక శిల్పాలు చెక్కారు
డి. సమాజంలో సతీసహగమనాన్ని విధిగా పాటించారు
1) ఎ 2) బి
3) బి, సి 4) డి

**11. కింది వాటిలో నాగార్జున కొండలో లభించిన శిల్పాల్లో లేనిది గుర్తించండి.**
ఎ. రాజు పట్టాభిషేక మహోత్సవ శిల్పం
బి. రాజు ధనాన్ని బౌద్ధ భిక్షకులకు దానం చేసే శిల్పం
సి. రాజు ఎనిమిదిమందితో సన్యాస ఆశ్రమానికి వెళ్లే శిల్పం
డి. ఐదుగురు రాణులు వారిస్తున్న రాజు బుద్ధునికి సాష్టాంగ నమస్కారం చేసే శిల్పం
1) ఎ, డి 2) ఎ
3) సి 4) ఎ, బి

**12. కింది వాక్యాల్లో సరైనది గుర్తించండి.**
ఎ. హారతి అనే కులదేవతను ఇక్ష్వాకులు పూజించేవారు
బి. రుద్రపురుష దత్తుడు వేసిన శాసనం గురజాల శాసనం
సి. వీరపురుష దత్తుడు బౌద్ధ మతాన్ని పోషించాడు
డి. ఇక్ష్వాకుల కాలంలో ఉపాసిక బోధిశ్రీ బౌద్ధ మత ప్రచారానికి విశిష్ట సేవలందించింది
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) పైవన్నీ సరైనవే

**13. విష్ణుకుండినుల కాలంనాటి శాసనాలను జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. పృథ్వీ మహారాజ్ | 1. తుమ్మలగూడెం శాసనం |
| బి. మొదటి గోవింద వర్మ | 2. తాండి వాడ శాసనం |
| సి. రెండో మాధవ వర్మ | 3. తుండి శాసనం |
| డి. రెండో విక్రమేంద్ర వర్మ | 4. వేల్పూరు శాసనం |

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-2, బి-1, సి-4, డి-3
3) ఎ-3, బి-2, సి-1, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

**14. విష్ణు కుండినుల నాణేలకు సంబంధించి సరైనవి గుర్తించండి.**
ఎ. వీరి నాణేలపై త్రిశూలం, సింహం, నంది, ఓడబొమ్మలు ఉన్నాయి
బి. వీరి నాణేలు రాగి, ఇనుము మిశ్రమంతో ముద్రించబడ్డాయి
సి. వీరి నాణేలు మహారాష్ట్రలో నాసిక్, నాగపూర్, ఖాన్‌పూర్‌తో పాటు మధ్యప్రదేశ్‌లోని బ్రహ్మగిరిలో కూడా లభ్యమయ్యాయి
1) ఎ 2) బి
3) సి 4) ఎ, బి, సి

**15. కింది వాటిలో సరైనవి గుర్తించండి.**
ఎ. విష్ణుకుండినులు తాము అమరపురుషులమని చెప్పుకున్నారు
బి. విష్ణుకుండినల రాజ్య స్థాపకుడు ఇంద్రవర్మ
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**16. విష్ణుకుండినులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. ఇంద్రపాల నగరం | 1. యజ్ఞవాటికలు |
| బి. బెజవాడ | 2. బౌద్ధ విహారాలు |
| సి. అమలాపురం | 3. శివ క్షేత్రం |
| డి. కీసరగుట్ట | 4. గృహాలయాలు |

1) ఎ-2, బి-4, సి-1, డి-3
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-2, సి-4, డి-1
4) ఎ-1, బి-2, సి-3, డి-4

**17. విష్ణుకుండినుల పాలనకాలంలో నిర్మించిన విహారాలు, అవి ఉన్న ప్రాంతాలను జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. తోటకొండ | 1. హీనయాన బౌద్ధ విహారం |
| బి. చైతన్యపురి | 2. శాక్య భిక్షు విహారం |
| సి. గుణపాశపురం | 3. తోఖలిఖిత మహావిహారం |

1) ఎ-1, బి-2, సి-3
2) ఎ-3, బి-2, సి-1
3) ఎ-2, బి-3, సి-1
4) ఎ-3, బి-1, సి-2

**18. రెండో మాధవ వర్మ గురించి సరికానిది గుర్తించండి.**
1) ఇతనికి కవి వత్సల అనే బిరుదు ఉంది
2) నేరం చేసిన తన కుమారుడికి మరణ శిక్ష విధించిన న్యాయనిర్ణేత
3) వేల్పూరులో దంతముక స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు
4) పల్లవులను, వాకాటకులను, వాసిష్ఠ వంశస్థులను ఓడించాడు

**19. కింది వాటిలో ఘటికల గురించి సరైనవి గుర్తించండి.**
ఎ. విష్ణుకుండినుల శాసనాల్లో ఘటికల గురించి తొలి ప్రస్తావన ఉంది
బి. వద్దంకుడు రాసిన సోమదేవ గ్రంథంలో ఘటికల గురించి వివరణ ఉంది
సి. ఇవి హిందూ దేవాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వేద పాఠశాలలు
1) ఎ, బి 2) సి
3) బి, సి 4) ఎ, బి, సి

**20. విష్ణుకుండినుల కాలంలో అధికారులు, వారి హోదాలను జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. రజకుడు | 1. భూ సర్వేఅధికారి |
| బి. గుల్మిక | 2. గ్రామాధికారి |
| సి. అక్షపాతాధికృతుడు | 3. అకౌంటెంట్ |
| డి. మహోత్తర | 4. రాష్ట్ర అధికారి |

1) ఎ-3, బి-1, సి-4, డి-2
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-2, బి-4, సి-1, డి-3
4) ఎ-4, బి-3, సి-2, డి-1

**21. విష్ణుకుండినుల కాలంనాటి సామాజిక వ్యవస్థకు సంబంధించి సరైనవి గుర్తించండి.**
ఎ. రాజులు నరమేధ యజ్ఞాలు చేసేవారు
బి. అన్ని రకాల సామాజిక దురాచారాలు వీరి కాలంలో కొనసాగాయి
సి. బౌద్ధమతం బలంగా ఉండటంతో స్త్రీలకు సముచిత స్థానం లభించింది
డి. వర్ణాశ్రమ ధర్మాన్ని రాజులు పట్టించుకోలేదు
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) పైవన్నీ సరైనవే

**22. విష్ణుకుండినుల రాజులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.**

| | |
|---|---|
| ఎ. మొదటి గోవింద వర్మ | 1. దివ్య పరీక్షల ద్వారా నిష్పక్షపాతమైన న్యాయం |
| బి. మొదటి మాధవ వర్మ | 2. బౌద్ధ మతాభిమాని అయిన వైష్ణవ మతస్థుడు |
| సి. రెండో విక్రమేంద్ర వర్మ | 3. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన రాజు |
| డి. రెండో మాధవ వర్మ | 4. 11 అశ్వమేధ, 16 రాజసూయ యాగాలను నిర్వహణ |

1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-1, సి-3, డి-4
3) ఎ-4, బి-2, సి-1, డి-3
4) ఎ-4, బి-3, సి-2, డి-1

**జవాబులు**

| | | | | |
|---|---|---|---|---|
| 1.4 | 2.4 | 3.1 | 4.2 | 5.4 |
| 6.1 | 7.3 | 8.1 | 9.1 | 10.4 |
| 11.2 | 12.4 | 13.2 | 14.4 | 15.3 |
| 16.1 | 17.3 | 18.1 | 19.4 | 20.2 |
| 21.1 | 22.2 | | | |

డా.మంతెన రవికుమార్
విషయనిపుణులు
ఆలూర్,నిజామాబాద్

